సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 29 । ఆగస్టు । 2023



కొండపై భక్తుల రద్దీ

మల్లాపూర్(కోరుట్ల): శ్రావణంలో రెండో సోమవారం సందర్భంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీకనక సోమేశ్వర ఆలయం భక్తులతో పోటెత్తింది.



శివ..శివ

వేములవాడ: శ్రావణ సోమవారం రాజన్నను 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దర్శనానికి దాదాపు ఐదు గంటల సమయం పట్టింది.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన మైనార్టీ నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ధర్మారం: రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మసీద్ కమిటీ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు సోమవారం కలిశారు. కరీంనగర్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఖబ్రస్తాన్ ప్రహరీకి నిధులు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ.జహీర్ తెలిపారు. మసీద్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ అల్లా ఉద్దీన్, ప్రధాన కార్యదర్శి మిస్బా అబ్దుల్ షఫీ, కోశాధికారిగా ఎండీ.యూసుఫ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

జ్యోతినగర్: అమరుల స్ఫూర్తితో విద్యుత్ సంస్థలను కాపాడుకోవాలని సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం .రామాచారి అన్నారు. కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీ భూపోరాట కేంద్రంలో సోమవారం విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. పోలీస్ తూటాలకు బలైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు నివాళులర్పించారు. 2000 సంవత్సరంలో అధికారంలో ఉన్న చంద్రబాబునాయుడు ప్రపంచబ్యాంకు విధానాలను అమలుచేసే క్రమంలో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపారని, దానిని నిరసిస్తూ వామపక్షాలు పోరాడేక్రమంలో పోలీసులు కాల్పులు జరిపారని, ఆ ఘటనలో బలైన వారి త్యాగాలు మరచిపోలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపేందర్, రమణ, సరిత, మహాలక్ష్మీ పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు

పెద్దపల్లిరూరల్:తమ సమస్యలను పరిష్కరించాలంటూ 16 రోజులుగా సమ్మెకు దిగినా పాలకులు పట్టించుకోవడం లేదని సెకండ్ ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వరూప అన్నారు. సోమవారం జిల్లా ప్రభుత్వాసుపత్రి వద్ద ఏఐటీయూసీ నాయకులు మేకల దాసు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, కడారి సునిల్‌తో కలిసి రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సీఎం కేసీఆర్ సారథ్యంలోని సర్కార్ మోసపూరిత విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. నాయకులు పూసాల రమేశ్, రాజరత్నం, రవీందర్, దివ్య, సుజాత, రమాదేవి తదితరులున్నారు.

గీత కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు



వినతిపత్రం అందిస్తున్న గీతకార్మికులు

రామగిరి: కల్లు గీతకార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరీ అంజిగౌడ్ అన్నారు. గీత కార్మికులకు రూ.లక్ష సహాయం ప్రకటించాలని కోరుతూ సంఘం మండల అధ్యక్షుడు మల్యాల మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో మార్కెట్ చౌరస్తాలోని అంబేద్కర్, పూలే విగ్రహాలకు నివాళులు అర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రాంచందర్‌కు వినతిపత్రం అందించారు. జిల్లాకేంద్రాల్లో నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.లక్ష సాయంలో గౌడులను చేర్చకుంటే జిల్లాకేంద్రంలో నిరాహారదీక్ష చేపడతామన్నారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్క, సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లెర్ల శ్రీనివాస్ గౌడ్, అధ్యక్షుడు ఏగోలపు సదయ్య గౌడ్, మహిళ అధ్యక్షురాలు బత్తిని నాగమణి, నాయకులు పాల్గొన్నారు.

నిషేధం ఉత్తదే..



ఈ చిత్రంలో మాడిపోయి కనిపిస్తున్న పత్తి చేను పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలోనిది. ఇటీవల కురిసిన వర్షాలకు కలుపుమొక్కలు పెరిగాయి. దీంతో రైతులు నిషేధిత గ్లైఫోసెట్ గడ్డిమందును పిచికారీ చేశారు. దాని ప్రభావంతో పంట పూర్తిగా మాడిపోయింది. కూలీ ఖర్చులకు భయపడి ఆ మందును పిచికారీ చేస్తున్నారు తప్పితే.. ఆరోగ్యం చెడిపోతే చికిత్సకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు గ్రహించడం లేదు.

- విచ్చలవిడిగా గ్లైఫోసెట్ విక్రయాలు
- నేలను నిస్సారం చేస్తున్న గడ్డిమందు
- కూలీల కొరతతో మొగ్గుచూపుతున్న రైతులు
- నామమాత్రంగానే టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



కలుపుమందు పిచికారీ చేస్తున్న రైతులు

సాక్షి, పెద్దపల్లి: గడ్డి మందు కలుపు మొక్కల్ని నాశనం చేసే రసాయనం. పంటల మధ్య పెరిగే గడ్డిని చంపాల్సిందిపోయి సారవంతమైన నేలను నిస్సారం చేస్తున్న ప్రమాదకారి గ్లైఫోసెట్. అన్నదాతలకు అవగాహనలేకపోవడం.. పత్తి చేనులో కలుపు తీయడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడం.. ఆ ఖర్చును తగ్గించుకునేందుకు రైతులు కలుపు నివారణ మందులను ఆశ్రయిస్తున్నారు. ఇది ఫర్టిలైజర్ వ్యాపారులకు వరంగా మారుతోంది. ఇదే అదనుగా వ్యాపారులు నిషేధం ఉన్నప్పటికీ విక్రయిస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పంటల్లో కలుపు మొక్కలు ముసురుకుని దిగుబడులపై ప్రభావం చూపనున్నాయి. దీనికితోడు గ్రామాల్లో కూలీల కొరత, కూలీల రేట్లు పెరిగిపోవడంతో రైతులు కలుపు నివారణ మందుల వైపు మొగ్గ చూపుతున్నారు. కానీ ఈ అత్యంత ప్రమాదకరమైన గ్లైఫోసెట్ వినియోగంతో రైతులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. దీర్ఘకాలంలో ఊపిరితిత్తుల సమస్యలు, టీబీ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ఆదేశాల అమలు లేక

2018 నుంచి తెలంగాణలో గ్లైఫోసెట్ వాడకంపై ఆంక్షలు ఉన్నాయి. అయితే నిషేధం సరిగా లేక పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ఈ రకం గడ్డిమందు విపరీతంగా దిగుమతి అవుతోంది. ప్రధానంగా జూన్ నుంచి అక్టోబర్ వరకు అమ్మకాలపై నిషేధం ఉంటుంది. కేవలం గ్లైఫోసెట్ మాత్రమే కాదు.. ఏ ఉత్పాదకాన్ని అమ్మాలన్నా.. వ్యవసాయాధికారి చీటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయినా అది ఎక్కడా అమలుకావటం లేదు. రైతుల పంటపొలాలను లేదా నమూనాలను పరిశీలించి నివారణ మందులను సిఫారసు చేస్తూ ఏఓ నుంచి ఏడీఏ తదితర పైస్థాయి అధికారి తమ లెటర్ ప్యాడ్‌పై రాసిస్తేనే దుకాణాదారులు సదరు మందులను రైతులకు విక్రయించాలి. కానీ జిల్లాలో కనీసం ఒక్కశాతం కూడా అమలు కావటం లేదు. ఏఈఓలకు మందులు రాసే అధికారం లేకపోగా.. ఏఓలు, ఏడీఏలు అన్ని గ్రామాల రైతులకు అందుబాటులో ఉండడం లేదన్న అపవాదు ఉంది. ఉద్యానశాఖ అధికారుల తీరుకూడా ఇదే రీతిన ఉండటంతో రైతులే నేరుగా పంట లక్షణాలను వ్యాపారులకు వివరించి మందులను కొని తీసుకెళ్లి చల్లుతున్నారు. కొన్ని సందర్భాల్లో నివారణ జరిగినా మరికొన్ని సార్లు విఫలమవుతోంది.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు



మాట్లాడుతున్న డీసీపీ వైభవ్‌గైక్వాడ్

- మోసపోతే 1930కి సమాచారమివ్వాలి
- అపరిచితులతో ఆన్‌లైన్ చాటింగ్‌లొద్దు
- డీసీపీ వైభవ్ గైక్వాడ్

పెద్దపల్లిరూరల్: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తన పేరిటే అపరిచితులు ఫేక్ ఫేస్‌బుక్ ఐడీ సృష్టిస్తే ముగ్గురు మిత్రులు సుమారు రూ.లక్ష వరకు మోసపోయారని పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్ అన్నారు. జిల్లాకేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల భద్రత - పోలీసుల బాధ్యత కార్యక్రమంలో విద్యార్థులకు చట్టాలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. అపరిచితులకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఓటీపీ చెప్పొద్దన్నారు. గుర్తుతెలియని వ్యక్తులతో చాటింగ్ చేయొద్దని, అలాంటి సమయంలో హెల్ప్‌లైన్ 1930కి సమాచారం ఇవ్వాలని సూచించారు. బెదిరింపులకు పాల్పడే ఘటనల నుంచి ఎలా బయటపడాలో వివరించారు. విద్యార్థినులు, మహిళల భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే జరిమానాతోపాటు జైలుశిక్ష తప్పదన్నారు. సీఐ అనిల్, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ రహీంపాషా, ఎస్సైలు మహేందర్, మల్లేశ్, అశ్విని, షీటీం ఎస్సై రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సమాజ భద్రత పోలీసుల బాధ్యత: ఏసీపీ శ్రీనివాసరావు

జ్యోతినగర్: ప్రజలకు సత్వర సేవలు అందించేలా పోలీసులు సమాజ భద్రత.. పోలీసుల బాధ్యత నినాదంతో విధులు నిర్వర్తిస్తున్నారని గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు అన్నారు. ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాస కేంద్రం ఆడిటోరియంలో రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై బి.జీవన్ ఆధ్వర్యంలో మహిళా చట్టాలు, షీటీమ్స్, ఈవ్ టీజింగ్, పోక్సో ర్యాగింగ్, సైబర్ క్రైం, ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థినులకు కల్పించారు. సమస్య ఉంటే ధైర్యంగా పోలీసులకు సమాచారం అందించాలని, డయల్100, రామగుండం పోలీస్ కమిషనరేట్ షీటీం వాట్సాప్ నంబర్ 63039 23700కు ఫిర్యాదు చేయాలని వెల్లడించారు. రక్షాబంధన్ పురస్కరించుకుని విద్యార్థినులు ఏసీపీతోపాటు పోలీసు అధికారులకు రాఖీలు కట్టారు. మహిళా కార్పొరేటర్లు కొలిపాక సుజాత, కల్వచర్ల కృష్ణవేణి, ఎస్సైలు సంతోష్, వెంకట్, శరణ్య పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ లక్ష్యాలు పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాం ప్రసాద్‌లాల్‌తో కలిసి పాల్గొన్నారు. హరితహారం, ఆసరాపింఛన్, గొర్రెల పంపిణీ, బీసీ, మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సహాయం, దళితబంధు, ఇంటి పట్టాల పంపిణీ, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ వంటి అంశాలపై సూచనలు చేశారు. పింఛన్‌దారుడు చనిపోతే భార్యకు అవకాశం కల్పించాలన్నారు. గొర్రెల పంపిణీ పథకం కింద ఇప్పటివరకు 708 గొర్రెల యూనిట్ల పంపిణీ చేశామన్నారు. గృహలక్ష్మి పథకం కింద జిల్లాలో మొదటిదశ దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని, పనులు మొదలుకాగానే రూ.లక్ష విడుదలవుతాయని వివరించారు. జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ శ్రీధర్, డీఎఫ్‌ఓ శివయ్య, మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్‌మహ్మద్, బీసీ అధికారి రంగారెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు ఇవ్వాలని ధర్నా



ధర్నా చేస్తున్న విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం మౌనం వీడాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు మహాధర్నా చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ జాహెద్‌పాషాకు వినతిపత్రం ఇచ్చారు. తొమ్మిదేళ్లుగా ఇళ్లు ఇవ్వలేదని, ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గృహలక్ష్మి పథకం పేరుతో మరోమోసానికి తెరలేపిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక నిరుపేదలందరికీ ఇంటి స్థలాలతోపాటు నిర్మాణానికి రూ.ఐదులక్షలు కేటాయిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య, మత్స్య పారిశ్రామిక సంఘం మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య, మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, కాంగ్రెస్ మండల కన్వీనర్ మునీర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సబ్బని రాజమల్లు, సర్పంచు పాల్గొన్నారు.

రూ.54.10 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు



పనులు ప్రారంభిస్తున్న చందర్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి రూ.54.10కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. వాటితో సీసీరోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీహాళ్ల నిర్మాణాలకు వినియోగిస్తామని వెల్లడించారు. నిధులు కేటాయించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్పొరేషన్‌లోని 36, 38, 44, 45 డివిజన్లలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.45 లక్షలతో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, కార్పొరేటర్లు జంగంపల్లి సరోజన, బాల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలకించండి.. పరిష్కరించండి

- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు
- సమస్యలపై ఏకరువు పెట్టిన జనం

పెద్దపల్లిరూరల్:తమ సమస్యలు ఆలకించాలని, పరిష్కారం చూపాలని జిల్లావ్యాప్తంగా బాధితులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి తరలివచ్చారు. వారి నుంచి అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్ అర్జీలు స్వీకరించారు. వాటిని వెంటనే పరిశీలించి పరిష్కారం చూపాలని సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. మరోసారి అదే సమస్యతో మళ్లీ ప్రజావాణికి రాకుండా చూడాలని సూచించారు. పెద్దపల్లి మండలం నిమ్మనపల్లికి చెందిన తూముల లక్ష్మి తాను ఒంటరి మహిళనని, పింఛన్ మంజూరు చేయాలని వేడుకుంది. దివ్యాంగుడినైన తనకు ఉపాధి చూపాలని రామగుండంకు చెందిన మడక సంపత్ కోరారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

20 ఏళ్లుగా తిరుగుతున్న..



వారసత్వంగా వచ్చిన భూమి వివరాలను రెవెన్యూ అధికారులు తప్పుగా నమోదు చేశారు. ధరణి అమల్లోకి వచ్చిన తర్వాత కూడా సరిచేయకపోవడంతో మా భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. 20 ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– బండి మల్లయ్య, వెన్నంపల్లి

పింఛన్ ఇప్పించి ఆదుకోండి



దివ్యాంగుడైన నా కొడుకు గణేశ్‌కు పింఛన్ అందించి ఆదుకోవాలి. పింఛన్ మంజూరుకు అన్ని అర్హతలూ ఉన్నాయి. మాది నిరుపేద కుటుంబం. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నం.

– కొడుకు గణేశ్‌తో లక్ష్మి, కుందనపల్లి, పాలకుర్తి

కన్నాల క్రషర్స్‌పై చర్యలు తీసుకోండి



పాలకుర్తి: మండలంలోని కన్నాల బోడగుట్ట క్వారీలు, వాటికి అనుబంధంగా ఏర్పాటు చేసిన క్రషర్లతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. క్రషర్లకు అతి సమీపంలోనే ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. దుమ్ము, శబ్దాలతో పిల్లలు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. కాలుష్య నియంత్రణకు యజమానులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది కలిగిస్తున్న క్రషర్స్‌పై చర్యలు తీసుకోండి.

– రాజు నాయక్, సర్పంచ్, కన్నాల

కస్తూరిబా భవనాన్ని పూర్తిచేయండి



రామగిరి: మండలంలోని పన్నూర్‌లో కస్తూరిబా భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలి. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకుగదుల్లో 202 మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. డెస్క్‌టేబుల్స్, బెడ్స్, బాతురూంలు, టాయ్‌లెట్స్ లేవు. అధికారులు స్పందించి నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– ముల్మూరి శ్రీనివాస్, బీజేపీ నాయకుడు

పునరావాస ప్యాకేజీ చెల్లించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ శంకరయ్య

రామగుండం: మేడిపల్లి ఓపెన్‌కాస్టు ప్రభావిత గ్రామం లింగాపూర్ దళితకాలనీకి పునరావాస ప్యాకేజీ పరిహారం చెల్లించాలి. మూడేళ్ల క్రితం సింగరేణి యాజమాన్యంతో జరిగిన చర్చల్లో ప్యాకేజీ చెల్లించేందుకు అంగీకరించారు. ఇప్పటివరకు ముందుకు కదలడం లేదు. అధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలి.

బాలిక మృతి ఘటనపై విచారణ

- పెద్దపల్లికి చేరిన బాలల హక్కుల కమిషన్



పెద్దపల్లిలో బాలలహక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ బృందావన్‌రావు, తదితరులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట శివారులో బాలికపై సామూహిక అత్యాచారం జరిగిన ఘనటపై వాస్తవాలను తెలుసుకునేందుకు సోమవారం రాష్ట్రబాలల హక్కుల కమిషన్ సభ్యులు జిల్లాకేంద్రానికి చేరుకున్నారు. పట్టణంలో బాలిక తిరిగినట్టు తేలిన ప్రాంతాలను బాలలహక్కుల కమిషన్ చైర్మన్ బృందావన్‌రావు, శోభారాణి, జిల్లా చైర్మన్ శ్రీధర్, శ్యాంసుందర్, ఐలయ్య, సుమలత సందర్శించినట్టు సమాచారం. వలసకూలీలు పనిచేసిన ఇటుకబట్టీల ప్రాంతంలోనూ వీరు పర్యటించినట్టు తెలుస్తోంది. ఘటన జరిగినట్టు ప్రచారంలో ఉన్న అప్పన్నపేట ప్రాంతాన్ని మంగళవారం సందర్శించి నిజానిజాలను నిర్ధారించనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై కమిషన్ రాష్ట్ర చైర్మన్ బృందావన్‌రావు మాట్లాడుతూ తాము ఘటనకు సంబంధించి వాస్తవాలను తెలుసుకునేందుకు వచ్చామన్నారు. ఆధారాలతో ఎవరైనా వచ్చి తమకు సమాచారమివ్వొచ్చని తెలిపారు.



వైభవంగా ఆదివరాహస్వామి కల్యాణం

కమాన్‌పూర్(మంథని):కమాన్‌పూర్‌లోని శ్రీఆదివరాహస్వామి వారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు కలకుంట్ల వరప్రసాదాచార్యుల బృందం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. రవీందర్ అనే భక్తుడు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ ఇనగంటి ప్రేమలత, డైరెక్టర్లు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఆర్జీ-3లో ఆపరేషన్స్ డైరెక్టర్ పర్యటన


ఓసీపీ-2లో ఆపరేషన్ డైరెక్టర్ శ్రీనివాస్

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఏరియాలో సోమవారం ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్వీకే. శ్రీనివాస్ పర్యటించారు. వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, రవాణాను పరిశీలించారు. పని ప్రదేశంలో ప్రతిఒక్కరూ రక్షణ సూత్రాలు పాటించాలని, ముందస్తు ప్రణాళికతో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని పేర్కొన్నారు. వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని, నీటిని బయటకు పంపేందుకు ముందుస్తుగా పంపులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఓసీపీ-2లో డైరెక్టర్ పర్యటన కేవలం గని సందర్శన కోసమేనా..? లేక ఆదివారం జరిగిన లద్నాపూర్ పోచమ్మ విగ్రహం తరలింపుపై అధికారులతో సమీక్షించారా..? తెలియాల్సి ఉంది. కే6 షావెల్ ప్రమాదం, భూ నిర్వాసితుల ఆందోళనపై అధికారులతో చర్చించినట్లు సమాచారం.

ధర్నాకు తరలిరండి


సమావేశంలో మాట్లాడుతున్న క్రిష్ణ

గోదావరిఖని: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపుమేరకు ఈనెల 29న హైదరాబాద్‌లో జరిగే ధర్నాను బొగ్గు గని కార్మికులు విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ బొగ్గు గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తోందని పేర్కొన్నారు. నాయకులు నరేష్, దుర్గయ్య, మొండయ్య, సాంబయ్య, శ్రావణ్, మధూకర్, శ్రీకాంత్, రవి, సతీశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఓనం



యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్‌లో సోమవారం ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ ఓదెలు, హెచ్‌ఎం రవీందర్ రావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



పెద్దపల్లిరూరల్: సమగ్ర శిక్షాభియాన్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సోమవారం స్థానిక బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందించారు. 15ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలను అందించాలని జిల్లా సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిప్పని తిరుపతి కోరారు. అరుణ, మమత, రహీముద్దీన్, శ్రావణ్, రాజ్‌కుమార్, మల్లయ్య, సంపత్, సంధ్య, నాగరాజు తదితరులున్నారు.

తేట తెలుగు.. తేనెలొలుకు

- భావోద్వేగాలను మాతృభాషలోనే హాయిగా వెల్లడించగలం
- అమ్మభాషకు పట్టం కడదాం
- నేడు తెలుగు భాషా దినోత్సవం

మాతృభాష తృణీకారం..
మాతృదేవి తిరస్కారంతో సమానం
– సినీ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి

అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
– సకిలించు ఆంధ్రుడా..
చావవెందుకురా..! – ప్రజాకవి కాళోజీ


గిడుగు-పిడుగు పుస్తక ముఖచిత్రం

విద్యానగర్/కరీంనగర్ కల్చరల్(కరీంనగర్): మనిషి జీవన విధానంలో ఆయువుపట్టు వంటిది మాతృభాష. అందులో జ్ఞానాన్ని పొందలేనివారిలో అభివృద్ధి తక్కువగా ఉంటుందని, వ్యక్తిత్వ వికాసం, మేధాపరమైన ప్రగతి మందగిస్తాయని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. దేశ భాషలందు తెలుగు లెస్స అని, ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని ప్రశంసలందుకున్న తెలుగుకు చాలా ప్రాధాన్యం ఉంది. ఈ భాషలోని నుడికారాలు, సామెతలు, జాతీయాలు, లోకోక్తులు వేటికవే ప్రత్యేకం. అమ్మ భాషలోనే మన భావోద్వేగాలను హాయిగా వెల్లడించగలుగుతాం. తెలుగు భాష ఉన్నతి కోసం విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి(ఆగస్టు 29న) సందర్భంగా ఏటా ఈరోజున తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం.

ప్రాధాన్యత కోల్పోతున్న తెలుగు

గిడుగు వెంకట రామ్మూర్తి కృషితో తెలుగుకు కొత్త వెలుగులు వచ్చినప్పటికీ పాలకుల నిర్వాకంతో అమ్మ భాష రోజురోజుకూ నిరాదరణకు గురవుతోంది. తెలుగులో రాయడం ఆత్మన్యూనతగా, ఆంగ్ల మాధ్యమంలో చదవడం నాగరికంగా మారిన కారణంగా సొంత గడ్డపైనే తెలుగు పరాయిదయిపోయింది. అధికార భాషగా తెలుగును అమలు చేయాలన్నది ఆచరణలో అంతంతమాత్రంగానే ఉంది. తెలుగు ప్రజల విజ్ఞప్తి మేరకు 2011లో కేంద్ర ప్రభుత్వం తెలుగును ప్రాచీన భాషగా ప్రకటించింది. తెలుగువారి ప్రస్తావన మహాభారతం, బౌద్ధుల కాలంలోనూ ఉంది.

తెలుగు మహాసభలు

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒక వేదికపై తీసుకువచ్చి, తెలుగు భాషా సంస్కృతి, చరిత్ర, కళలను తెలుసుకొని, స్నేహ సంబంధాలను వృద్ధి చేసుకోవాలన్న లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టింది. 1975 నుంచి 2012 వరకు అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2017 మే 2న తెలంగాణ సాహితీ అకాడమీ ఏర్పాటు చేసింది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో అదే ఏడాది అక్టోబర్‌లో తెలుగు మహాసభలు నిర్వహించారు. అప్పటి నుంచి మళ్లీ వాటి ఊసే లేకుండా పోయింది.

కవులు చైతన్యం తీసుకురావాలి



ఆంగ్ల భాష వ్యామోహంలో పడి, తెలుగు భాషను విస్మరిస్తున్నాం, ఉద్యోగ నియామకాల్లో తెలుగు మీడియంలో చదివినవారికే ప్రాధాన్యం ఇవ్వాలి. కోర్టు తీర్పులు తెలుగులో వెలువడేలా చూడాలి. కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలి.
– దాస్యం సేనాధిపతి, ప్రముఖ కవి, విమర్శకుడు

తెలుగులో సాంకేతిక విద్యనందించాలి



ఆలోచనలను వ్యక్తపరిచే సాధనం అమ్మ భాష. నేడు తెలుగులో మాట్లాడటమే చిన్నతనంగా భావించడం బాధాకరం. సాంకేతిక విద్యను సైతం తెలుగు మీడియంలో అందించాలి. తెలుగు మాధ్యమంలో చదివే విద్యార్థులకు ప్రత్యేక వెయిటేజీ ఇవ్వాలి.
– గాజుల రవీందర్, ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

చిరస్మరణీయుడు.. గిడుగు



గిడుగు చిరస్మరణీయుడు. ఆయన వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. విశ్వవిద్యాలయాల్లో వాడుక భాష రాజ్యమేలుతోంది. పత్రికలూ పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది.
– నంది శ్రీనివాస్, సాహితీ గౌతమి అధ్యక్షుడు

మాతృభాష నేర్పించాలి



తెలుగు భాషను పరిరక్షించాలి. ప్రాథమిక చదువులు మాతృభాషలో కొనసాగితేనే ఆలోచన శక్తి, ప్రశ్నించేతత్వం విద్యార్థుల్లో పెరుగుతాయి. తల్లిదండ్రులు ఆంగ్లంపై ఉన్న వ్యామోహాన్ని తగ్గించి, పిల్లలకు మాతృభాష నేర్పించాలి.
– కేఎస్.అనంతాచార్య, సమైక్య సాహితీ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్

కొత్త తరానికి అందించాలి



భాషా నుడికారాలు, సాహిత్య సౌరభాలను కొత్త తరానికి అందించాలి. ప్రపంచీకరణతో మన భాషా సంస్కృతులను రక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆంగ్ల భాష వ్యామోహం నుంచి మాతృభాష వైపు మళ్లాల్సిన అవసరం ఉంది.
– కొత్త అనిల్‌కుమార్, తెలంగాణ రచయితల సంఘం, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

పరిపాలనలో అమలు చేయాలి



తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ వర్తింపజేయాలి. వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. పాలకులు పరిపాలనలో తెలుగును పక్కాగా అమలు చేయాలి. అందరం అమ్మ భాషకు పట్టం కడదాం.
– మాడిశెట్టి గోపాల్, సమైక్య సాహితీ అధ్యక్షుడు, కరీంనగర్

ఓసీపీలో డోజర్ ఢీకొని కాంట్రాక్టు కార్మికుని మృతి

- సమాచారం లేకుండానే శవం తరలింపు
- కాంట్రాక్టర్ తీరుపై యాజమాన్యం ఆగ్రహం


గంగాప్రసాద్(ఫైల్)

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 పరిధిలోని ఓసీపీ-3 ప్రయివేట్ ఓబీ కంపెనీలో జరిగిన ప్రమాదంలో గంగాప్రసాద్ (24) ప్రైవేట్ డ్రిల్ ఆపరేటర్ మృతి చెందాడు. గంగాప్రసాద్ ఓసీపీ-3 పైలట్‌క్వారీ వద్ద సోమవారం వేకువజామున డ్రిల్ పనులు చేస్తున్నాడు. డ్రిల్లింగ్ నడిచేందుకు ఆ ప్రాంతాన్ని క్లీన్ చేసేందుకు డోజర్ వద్దకు బయల్దేరాడు. అతడిని గమనించని డోజర్ ఆపరేటర్ యంత్రాన్ని ముందుకు నడపడంతో అతనిపై నుంచి వెళ్లింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన గంగాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని బయటకు పొక్కనీయకుండా శవాన్ని కరీంనగర్ ఆసుపత్రికి.. అక్కడ నుంచి పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. యాజమాన్యం, కార్మిక సంఘాలకు సమాచారం ఇవ్వకుండానే శవాన్ని మాయం చేశారని కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఓసీపీని మరో కేజీఎఫ్‌గా మార్చేందుకు ఓబీ కాంట్రాక్టర్లు ప్రయత్నిస్తున్నారని, ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి.

ప్రమాదంపై డీడీఎంఎస్ విచారణ

- మృతదేహం తరలింపుపై యాజమాన్యం సీరియస్
- ప్రమాదం తీరుపై నివేదిక కోరిన ఉన్నతాధికారులు


గంగాప్రసాద్ మృతదేహం

గోదావరిఖని: డోజర్ ఢీకొని కాంట్రాక్టు కార్మికుడు గంగాప్రసాద్ చనిపోగా.. మృతదేహాన్ని తరలించిన ఘటనపై డీడీఎంఎస్ బానోతు వెంకన్న విచారణ చేపట్టారు. ముందుగా ఘటనస్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదంపై సాక్షుల నుంచి వివరాలు సేకరించారు. సింగరేణి డైరెక్టర్ ఎన్వీకే.శ్రీనివాస్ ఘటన స్థలాన్ని సందర్శించారు. ఆర్జీ-2 పరిధిలోని ప్రైవేటు ఓబీలో సోమవారం వేకువజామున డోజర్ ఢీకొని డ్రిల్ ఆపరేటర్ చనిపోయిన విషయం తెల్సిందే. విషయాన్ని అటు యాజమాన్యం, ఇటు కార్మిక సంఘాలకు తెలపకుండా మృతదేహాన్ని కరీంనగర్‌కు.. అక్కడి నుంచి పెద్దపల్లికి తరలించడంపై యాజమాన్యం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టింది. మధ్యప్రదేశ్ ప్రాంతానికి చెందిన కార్మికుడి మృతిని గుట్టుచప్పుడు కాకుండా క్వారీనుంచి బయటకు తరలించి ప్రమాదం జరగలేదని చిత్రీకరించే ప్రయత్నం చేశారని కార్మికులు అంటున్నారు. డోజర్ ఢీకొనగా కార్మికుడి కుడికాలు నుజ్జునుజ్జయ్యింది. తలపగిలిపోయింది. అయినా చికిత్స పేరుతో బయటకు తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కూడా డోజర్‌తో క్లీన్ చేసినట్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఘటన ప్రాంతాన్ని శుభ్రం చేయడంపై కూపీలాగుతోంది. ఉన్నతాధికారులు సైతం నివేదిక కోరినట్లు సమాచారం. ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ప్రమాదంలో చనిపోయిన గంగాప్రసాద్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఓసీపీ-3 ప్రాజెక్ట్ ఆఫీసర్ తీరును జేఏసీ నాయకులు ఐలి శ్రీనివాస్, కదారి సునీల్, కంది రాజారత్నం, తాండ్ర సదానందం, ఓదెలు, నారాయణ, పూసల తిరుపతి, అక్బర్‌అలీ, చంద్రమౌళి, కుమారస్వామి, విశ్వనాథ్, రామకృష్ణ, తోకల రమేష్, సత్యనారాయణ రెడ్డి, సల్ల రవీందర్, కొండి శ్రీనివాస్, చిటికెల రాయలింగు, మద్దెల శ్రీనివాస్, దావు రమేష్ తదితరులు హెచ్చరించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

రామగిరి: సింగరేణి అధికారుల నిర్లక్ష్యంతోనే గనిలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఏఐటీయూసీ ఆర్జీ-3 బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ.రెడ్డి ఆరోపించారు. ఓసీపీ-2 అడిషనల్ మేనేజర్ నారాయణ కార్మికులను పని ఒత్తిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. కే6 షావెల్ ప్రాంతంలో రక్షణ లేదని, రాత్రిపూట యంత్రం నడపవద్దని చెప్పినా.. ఇన్‌చార్జి మేనేజర్ వినకుండా బలవంతం చేశారని పేర్కొన్నారు. షావెల్ నీటిసంపులో పడిపోతుండంతో షావెల్ బకెట్ సహాయంతో ఆపరేటర్ తృటిలో ప్రాణాలు కాపాడుకున్నారని పేర్కొన్నారు. దీనికి పూర్తి బాధ్యత అడిషనల్ మేనేజర్ నారాయణదేనని, మైన్స్ యాక్ట్ ప్రకారం ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ డీటీ.రావు, వైస్ ప్రెసిడెంట్ కందికట్ల సమ్మయ్య, రవికుమార్, జూపాక రాంచందర్, రమణయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి


అనురాగ్(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 15వ డివిజన్ యైటింక్లయిన్‌కాలనీ రాజీవ్‌నగర్‌కు చెందిన తోకల అనురాగ్ (29) గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం ఒక్కసారిగా ఛాతీలో నొప్పి వస్తుందంటూ కుప్పకూలాడు. అనురాగ్ బీజేపీ కార్యకర్తగా కొనసాగుతున్నాడు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అనురాగ్ మృతదేహంపై పార్టీ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. అంతిమయాత్రలో బీజేపీ కార్పొరేటర్లు మందల కిషన్ రెడ్డి, మల్లేశ్, నాయకులు మూకిరి రాజు పాల్గొన్నారు. తండ్రి సింగరేణిలో పనిచేస్తూ.. అన్‌ఫిట్ అయ్యాడు. అనురాగ్‌కు వారసత్వంగా ఉద్యోగం పెట్టించే ప్రయత్నంలో ఉన్నారు. అంతలోనే ఇలా జరగడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

వేర్వేరు కేసుల్లో నలుగురికి జైలు

పెద్దపల్లిరూరల్: మూడు కేసుల్లో నలుగురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి సోమవారం తీర్పు చెప్పారు. పెద్దపల్లి ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గతనెల జిల్లాకేంద్రంలో ఓ లారీ జాకీ, ఇతర సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని సాగర్‌రోడ్‌కు చెందిన గులాంఖాజా పాషా ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన గాజర్ల సాగర్, సుభాష్‌నగర్‌కు చెందిన జూపాక శ్రీనివాస్‌ను నిందితులుగా గుర్తించి కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో జూనియర్ సివిల్ జడ్జి రాణి వారికి నాలుగు నెలల చొప్పున జైలు శిక్ష విధించారు. పెద్దపల్లి మండలం భోజన్నపేట లో ప్రేమపెళ్లి విషయమై జరిగిన గొడవలో ముంజ రమేశ్‌పై దాడికి పాల్పడి గాయపర్చిన కటికెనపల్లి శంకర్‌పై కేసు నమోదు చేసి విచారణ జరిపారు. సాక్షులను విచారించిన జూనియర్ జడ్జి రాణి శంకర్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్సై మహేందర్ పేర్కొన్నారు. 2015 అక్టోబర్‌లో పెద్దపల్లి మండలం పెద్దకల్వలకు చెందిన సోదరులు చెల్కల ఓదెలు, దుర్గయ్య మధ్య భూతగాదా ఏర్పడడంతో గొడవపడ్డారు. ఈ ఘర్షణలో ఓదెలుకు గాయమైంది. ఓదెలు భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా సాక్షులను విచారించిన జడ్జి దుర్గయ్యకు 10నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

కమిషనరేట్ సర్వీస్ రోడ్డులో క్షుద్రపూజలు

జ్యోతినగర్: రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు వెళ్లే రాజీవ్ రహదారి సర్వీసు రోడ్డు మధ్యలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు స్థానికులను భయాందోళనకు గురిచేశాయి. సంఘటన స్థలం వద్ద వరాహాన్ని వధించి తలను రోడ్డుమధ్యలో పెట్టారు. మొండెంను రోడ్డు పక్కన పడేశారు. ఉదయం ఆ మార్గంమీదుగా వెళ్లిన ప్రజలు గమనించి భయాందోళనకు గురయ్యారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు రంగంపల్లికి చెందిన వునుకొండ వెంకటేశం (50) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేశం.. మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య సరోజన, ఇద్దరు పిల్లలున్నారు.

చదవాలని ఉంది కానీ..

- చదివించే స్థోమత లేదు
- దాతల కోసం ఇంజినీరింగ్ విద్యార్థి వినతి


తల్లి జలతో విద్యార్థి రంజిత్

కథలాపూర్(వేములవాడ): తండ్రి చిన్నతనంలో వదిలేయశాడు.. దీంతో తల్లి కూలీ పనులు చేస్తూ ఒక్కగానొక్క కొడుకును ఉన్నత చదువులు చదివించింది. ఇంటర్ పూర్తయ్యాక ఇంజినీరింగ్‌లో సీటు సాధించిన కుమారుడు.. హాస్టల్ వసతి, స్పెషల్ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉండటంతో ఆర్థికంగా ఆదుకోవాని వేడుకుంటున్నాడు. వివరాలు.. తాండ్ర్యాల గ్రామానికి చెందిన సాదుల జలకు కుమారుడు రంజిత్ ఉన్నాడు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి వరకు చదివాడు. కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతేడాది ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్ రాశాడు. అందులో 42 వేల ర్యాంక్ సాధించాడు. హైదరాబాద్ ఐఏఆర్‌ఈ కళాశాలలో ఐటీ విభాగంలో సీటు వచ్చింది. అక్కడ ఉండటానికి వసతి, కాలేజీలో స్పెషల్ ఫీజు చెల్లించాల్సి ఉంది. కానీ, చేతిలో చిల్లి గవ్వలేదని విద్యార్థి రంజిత్, తల్లి జల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము రేకుల షెడ్డులో ఉంటూ బతుకుతున్నామని, రూ.వేలు చెల్లించేది ఎలా అని దీనంగా పేర్కొంటున్నారు. దాతలు ముందుకు వచ్చి సాయం చేస్తే ఇంజినీరింగ్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ కావాలని ఆశగా ఉందని రంజిత్ వేడుకుంటున్నాడు.

ఎవరైనా దాతలు ఉంటే.. ఫోన్ పే నంబర్ : 70951 63443కు సాయం చేయాలని అభాగ్యులు అభ్యర్థిస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వలకు చెందిన పయ్యావుల రాహుల్ (24) హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం ఈనెల 26న రాహుల్ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. స్థానికంగా ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

సింగరేణి సీఎంఓగా సుజాత


సుజాత

గోదావరిఖని: సింగరేణి సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ పన్నెం సుజాతను నియమిస్తూ యాజమాన్యం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. మెయిన్ ఆసుపత్రిలో అడిషనల్ సీఎంఓగా పనిచేస్తున్న డాక్టర్ ఎ.విక్టర్‌వందనంను ఇదే ఆసుపత్రిలో అడ్మిన్ అడిషనల్ సీఎంఓగా నియమించారు. ఆర్కే-8 డిస్పెన్సరీలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి.రమేష్‌బాబును డిప్యూటీ సీఎంఓగా మెయిన్ ఆసుపత్రికి బదిలీ చేశారు.

ఓసీపీ-2లో తప్పిన ప్రమాదం


కే6 షావెల్

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-2లో ప్రమాదం తప్పింది. ఓబీ బెంచ్ సంప్ వద్ద పనులు నిర్వహిస్తుండగా.. ఓబీ జారిపోయి కే6 షావెల్ ఒక పక్కకు ఒరిగింది. గ్రహించిన ఆపరేటర్ షావెల్‌బకెట్ సహాయంతో తృటిలో తప్పించుకున్నాడు. లద్నాపూర్‌లోని మదనపోచమ్మను తరలించారని అటు గ్రామస్తులు ధర్నా నిర్వహించిన మరునాడే ప్రమాదం చోటుచేసుకోవడంతో కార్మికులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంఘటనపై విచారణ నిర్వహిస్తామని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పీవో రాజేందర్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజలతో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

జ్యోతినగర్: రామగుండం నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రజలను కలుసుకున్నారు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా, నాయకులు సాగర్‌రెడ్డి, అబ్దుల్లా, రహీం, రవి, సిరిశెట్టి సతీశ్ పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరిస్తా

గోదావరిఖని: సింగరేణి సెక్యూరిటీ గార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాజ్‌ఠాగూర్ అన్నారు. ఆర్జీ-1 జీఎం కార్యాలయం వద్ద సింగరేణి, ప్రైవేట్ సెక్యూరిటీగార్డులను కలిశారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న సిబ్బంది జీతభత్యాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. ఆయన వెంట ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, కాల్వ లింగస్వామి, కొప్పుల శంకర్, ఓదెలు, విజయ్, శివ పాల్గొన్నారు.





శివ..శివ

వేములవాడ: శ్రావణ సోమవారం రాజన్నను 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దర్శనానికి దాదాపు ఐదు గంటల సమయం పట్టింది. ఎండ తీవ్రంగా ఉండడంతో ఆలయ పరిసరాల్లో భక్తులు పరుగులు తీశారు. ఉక్కపోతతో క్యూలైన్లలో ఇబ్బందులు పడ్డారు. పారిశుధ్యం నిర్వహణ సరిగ్గా లేని ఆలయ పరిసరాల్లో దుర్వాసన వచ్చింది. ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు, పీఆర్వో చంద్రశేఖర్ ఏర్పాట్లను పరిశీలించారు.